క్లుప్తంగా

దాసునాయన మఠంలో భగవద్గీత ప్రవచనాలు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువై యున్న ఆంజనేయ ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠంలో శుక్రవారం వివిధ మఠాధిపతుల ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. పీఠాధిపతి కటారు దాసునాయన అధ్యక్షత వహించగా, సజ్జాపురం పీఠాధిపతి జ్ఞానప్రకాశనంద స్వామి మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా దాసునాయన మఠంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతుల ఆధ్యాత్మిక ప్రసంగాలు, భగవద్గీత అంతరార్థం, వేదాంత పరిచయం ప్రబోధించటం గొప్ప శుభసూచికమన్నారు. అనంతరం బట్టువారి పల్లె బ్రహ్మంగారి పీఠాధిపతి సత్యనారాయణ ధర్మపత్ని మంగమ్మ, దాసరి పీరమాంబ, కళానందస్వామి తదితరులు ప్రసంగించారు. దాసునాయన మఠం కమిటీ సభ్యులు హాజరైన పీఠాధిపతులను శాలువాలతో సత్కరించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను నూతలపాటి హనుమాయమ్మ, కటారు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

సామూహిక వినాయక వ్రతం



నరసరావుపేట ఈస్ట్: పాలపాడురోడ్డులోని చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వినాయక వ్రతం నిర్వహించారు. ఆలయంలోని వినాయకుడికి గరిక, కుడుములతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని స్వామి వారికి 21 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

హరిహర క్షేత్రంలో కొనసాగుతున్న ప్రతిష్టా మహోత్సవాలు



రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు హరిహర క్షేత్రంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అర్చన, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం మండపారాధన, మండప పూజ, హోమాలు, ధాన్యాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం 9.45 గంటలకు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం స్వామి వారి అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తారు.

పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఐ.శాంతి తెలిపారు. మండలంలోని పెదరెడ్డిపాలెంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని, ఈ రకం పొగాకును రైతులు సాగు చేయవద్దని అన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, మినుము, పెసర వంటి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. తెల్లబర్లీ పొగాకును కొనుగోలు కంపెనీల అనుమతితో సాగు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.బ్రహ్మయ్య, వీఏఏ శైలజ పాల్గొన్నారు.

8 గంటల పని విధానాన్ని కొనసాగించాలి



నరసరావుపేట: కార్మికులకు 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, రాత్రిపూట మహిళలచే పని చేయించుకునే విధానాలను విడనాడాలని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. 13 గంటల పని విధానాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మార్కెట్‌యార్డుకు ఎదురుగా ధర్నా చేశారు. ఈ మేరకు నాయకులు రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు, డి.శివకుమారి, గుంటూరు విజయకుమార్, ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ పని గంటలను పెంచటమంటే పెట్టుబడిదారులకు ఊడిగం చేయటమేనన్నారు. పని గంటలు పెంచటం దారుణమన్నారు. వెంటనే పని గంటలు పెంచే ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా లేకుంటే ప్రమాదమే..!



యడ్లపాడు ఎర్రకొండ సమీపంలో ధ్వంసమైన ఇనుపగ్రిల్స్



తిమ్మాపురం హైవే జంక్షన్ వద్ద ప్రమాదభరితంగా ఉన్న గ్రిల్



తిమ్మాపురంలో హైవేపై ఉన్న ముళ్ల కంప

యడ్లపాడు: మండల పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ హైవే కావడంతో నిత్యం వచ్చిపోయే వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు వాహనాలు అతివేగంతో ప్రమాణిస్తుంటాయి. హైవేపై రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో భారీ వాహనాలు ఢీకొని సెంట్రల్, సైడ్ డివైడర్లు.. వాటిపై ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ ధ్వంసమవుతుంటాయి. యడ్లపాడు ఎర్రకొండ సమీపంలో మూడు నెలల కిందట జరిగిన ప్రమాదంలో రెండు చోట్ల ఇనుప గ్రిల్స్ ధ్వంసమయ్యాయి. తిమ్మాపురంలో ఆర్నెల్ల క్రితం హైవే జంక్షన్ సమీపంలోనే ఐరన్ గ్రిల్ ప్రమాదకరంగా పడి ఉంది. వీటికి హైవే అధికారులు తిరిగి మరమ్మతులు నిర్వహించలేదు. అలాగే తిమ్మాపురం నుంచి చిలకలూరిపేటకు ఉన్న హైవే రహదారి డివైడర్ల వద్ద పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు పెరుగుతున్నా వాటిని తొలగించడం లేదు. ఇవి రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి ప్రమాదంగా మారినా సంబంధిత అధికారులు వాటిని తొలగించడం లేదు. తిమ్మాపురం హైవేపై రాత్రివేళ విద్యుత్ దీపాలు కూడా లేకపోవడంతో బైక్‌లపై వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి వాటిని బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

మానసిక, శారీరక ఆరోగ్యంలో సమతుల్యత ఉండాలి



డాక్టర్ పవిత్రను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం



మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యం సమతుల్యంగా ఉండాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ టి.ఎస్.పవిత్ర తెలిపారు. సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ పవిత్ర మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ఆరోగ్యం పట్ల ప్రజలలో అవగాహన పెరిగిందని తెలిపారు. ప్రతి రోజు శారీరక వ్యాయామం చేయాలని వివరించారు. మానసిక రుగ్మతలు తొలగించేందుకు అవసరమైన మద్దతును అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కళాశాల పాలకవర్గ కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరాన్ని మానసిక ఆరోగ్యం ఇక సాధారణ మానవ హక్కుగా ప్రకటించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎ స్.సుధీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎ.స రళాదేవి, డాక్టర్ రాజనాల వేణుమాధవ్, పి.శ్రీనివాసులు, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి ఎం.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి

నాదెండ్ల: ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికి తీయాలని, వారు ఒత్తిడికి లోనుకాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రముఖ మానసిక ఆరోగ్య నిపుణుడు ఫణీందర్ చెప్పారు. నాదెండ్ల కేజీబీవీలో ఈ నెల 6 నుంచి శుక్రవారం వరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం కెరీర్ గైడెన్స్, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని అధిగమించే నైపుణ్యాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలన్నారు. జిల్లా బాలిక సంరక్షణ అధికారి డి.రేవతి మాట్లాడుతూ, బాలికలు చక్కగా చదువుకోవాలని, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యలు ఎదురైతే 14416 నంబరుకు ఫోన్ చేస్తే పోలీసులు, అధికారులు ఆదుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.మాధవీలత, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్మాణాలను గుర్తించి పన్నులు వేయండి

పురపాలక రీజనల్ డైరెక్టర్ హరికృష్ణ

నరసరావుపేట: పట్టణంలో డోర్ టు డోర్ సర్వే చేసి పన్నులు లేని భవనాలకు పన్నులు విధించాలని పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్ ఎస్.హరికృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ అతిథి గృహంలో ఆస్తి పన్ను విధింపులో అన్ అసైన్డ్, అండర్ అసైన్డ్ నిర్మాణాలను గుర్తించేందుకు చేస్తున్న సర్వేపై వార్డు సచివాలయ పరిపాలన కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష చేశారు. వాటర్ చార్జెస్ బకాయిలు స్పెషల్ డ్రైవ్ ద్వారా 100 శాతం వసూలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, రెవెన్యూ అధికారి కె.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.బెయిలిబాబు, సయ్యద్ జహంగీర్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో గ్రీవెన్స్

బొల్లాపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ ఎ.వి.సుధాకర్, ఎంపీడీవో పి.మాధురి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రతి సోమవారం ఉంటుందని చెప్పారు. మండల ప్రజలు సద్వినియోగపరచుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రొంపిచర్ల: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, రెడ్డిపాలెం, సుబ్బయ్యపాలెం, బుచ్చిబాపన్నపాలెం సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

విద్యార్థినులకు ఆటల పోటీలు

బొల్లాపల్లి: మండలంలోని మేళ్లవాగు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాలికలకు ఆటల పోటీలు శుక్రవారం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ ఆటల పోటీలు జరిగాయి. బాలిక దినోత్సవం పురస్కరించుకొని ఈ ఆటల పోటీలు నిర్వహించామని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం షేక్ ఖాజావలి, యాకోబు, అంగన్‌వాడీ కార్యకర్తలు సరోజినీ, ఆయాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో కృష్ణకుమారి

నరసరావుపేట రూరల్: ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల బలోపేతానికి ప్రజలు సహకరించాలని ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి తెలిపారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ ఇన్‌చార్జిలకు శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణకుమారి మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి హరిత రాయబారులకు అందజేయాలని తెలిపారు. అసిస్ట్ కో ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్వచ్ఛ రథంను ఉపయోగించుకోవాలని సూచించారు. తడి చెత్తను కాలువల్లో వేయవద్దని, పూడికను ఎప్పటికప్పుడు తీసి గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని పెంపొందించాలని తెలిపారు. అనంతరం ఘన వ్యర్థాల నిర్వహణపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగానంద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండటానికి ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించి ప్రజల్లో చైతన్యం పెంపాదించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంపై సర్పంచులు, ఉప సర్పంచులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సా. ధన కోసం ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలన్నారు. గ్రామాలన్నీ శుభ్రంగా ఉండటానికి అన్ని వీధుల్లో ఉన్న తడి, పొడి చెత్తను క్లాప్ మిత్ర సారథ్యంలో సేకరించేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న చెత్త సంపద కేంద్రాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రమైన గ్రామాలుగా తయారు కావటానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ బోడ్డు యాకోబు తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా స్కూల్ గేమ్స్ పోటీలు



అండర్-14 బాలుర కబడ్డీలో క్రీడాకారులు



అండర్-14 చెస్ పోటీలో క్రీడాకారులు

నరసరావుపేట రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ డివిజన్ స్థాయి ఆటల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. లింగంగుంట్ల శంకరభారతీపురం, డీఎస్ఏ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలకు డివిజన్‌లోని 9 మండలాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. కబడ్డీ అండర్-14 బాలుర విభాగంలో వినుకొండ, ఈపూరు జట్లు, బాలికల విభాగంలో నరసరావుపేట, ఈపూరు జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. చెస్ అండర్-17 బాలికల విభాగంలో తొలి మూడు స్థానాల్లో చిలకలూరిపేటకు చెందిన జి.మైథిలి, ఎం.గీతాశ్రీ, కె.లేఖనలు నిలిచారు. అలాగే అండర్-14 బాలికల చెస్, అండర్-14, 17 బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, మహిళా కార్యదర్శి డాక్టర్ ఉన్నం పద్మావతిలు పర్యవేక్షించారు. పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

వినుకొండ: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎస్.ప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొత్తమాసు శివలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం గ్రామ స్థాయి నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తయితే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పేరు వస్తుందనే కుట్రతో ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం దారుణమన్నారు. మెడికల్ కళాశాలల ప్రాధాన్యతను ప్రజల ద్వారా తెలుసుకునేందుకే కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబరు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో, మండలాల్లో నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పగడాల వెంకటరామిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, పార్టీ నాయకులు తలారి ఆంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు కోపెల దేవరాజ్, కొత్త కృష్ణారెడ్డి, యారం రామిరెడ్డిలతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ప్రయోజనం



జీఎస్టీపై అవగాహన కార్యక్రమంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్, అధికారులు

నాదెండ్ల: ప్రతి దుకాణం ముందు గత జీఎస్టీ-ప్రస్తుత జీఎస్టీ ధరలను బోర్డుల రూపంలో ప్రదర్శించాలని గుంటూరు-2 జీఎస్టీ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్ చెప్పారు. గణపవరం బొడ్డురాయి సెంటర్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం జీఎస్టీ శ్లాబులు తగ్గింపుతో ప్రజలకు పెద్ద మొత్తంలో ఆదా అవుతుందని వివరించారు. ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులు, మందులు, రైతులకు వ్యవసాయ పనిముట్లు, యంత్రాలపై జీఎస్టీ తగ్గింపుతో ప్రయోజనాలు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పీవీ రంగయ్య, చిలకలూరిపేట నియోజకవర్గ జీఎస్టీ నోడల్ అధికారి సుజాత, యడ్లపాడు, చిలకలూరిపేట, నాదెండ్ల మండలాల కన్వీనర్లు శరణ్, నిత్యానందం, సునీల్, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు, చిలకలూరిపేట భాను ఎలక్ట్రానిక్స్ యజమాని నూతలపాటి భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-కేవైసీతో నకిలీ మస్టర్ల నియంత్రణ

ఏపీడీ బూసిరెడ్డి



వివరాలు తెలుపుతున్న అధికారులు

శావల్యాపురం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల మస్టర్ పారదర్శకంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏపీడీ ఈపూరి బూసిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీడీ బూసిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండటానికి ఉపాధి కూలీలకు సంబంధించి మొబైల్ యాప్‌లో ఒక్కో కూలీ ఫొటోతో పాటు ఈ-కేవైసీ నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో నకిలీ మస్టర్ల నియంత్రణకు దోహదపడుతుందన్నారు. ఉపాధి పనుల్లో అవినీతి అక్రమాలకు తావు లేకుండా పని ప్రదేశంలోనే ఆన్‌లైన్ విధానంలో మొబైల్‌తో ఫొటోలు తీస్తారన్నారు.

ఇందులో భాగంగా బొల్లాపల్లి మండలం 34,983 మంది ఉపాధి కూలీలు ఉండగా ఇప్పటి వరకు 4,323 మందికి ఈ-కేవైసీ నమోదు చేసినట్లు తెలిపారు. ఈపూరు మండలం-20,623 మందికి గాను 7,556, నూజెండ్ల మండలం-28,320 మందికి 7,640, శావల్యాపురం మండలం-10,5759 మందికి 4,604, వినుకొండ మండలం-28,147 మందికి 8,347 మంది కూలీలకు నమోదు చేశారన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శావల్యాపురం మండలంలో రూ.90 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. నూతనంగా గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని లబ్ధిదారులను గుర్తించి త్వరితగతిన పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య ఉన్నారు.

మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరించరాదు



మాట్లాడుతున్న శ్రీనునాయక్, బాబురావు

చిలకలూరిపేట: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించకుండా ప్రభుత్వమే నిర్వహించాలని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్, సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు ప్రభుత్వమే నిర్వహించటం వలన పేదలకు ఉచిత వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్య లభిస్తుందన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. దీనిపై ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మన్యం జిల్లా కురుపాం గిరిజన పాఠశాలలో ఇద్దరు బాలికలు పచ్చకామెర్లతో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఆ బాలికల కుటుంబాలకు ఎటువంటి పరిహారం ప్రకటించకపోవడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన వసతి గృహాల్లో తక్షణమే మౌలిక సదుపాయాలు మెరుగు పర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ బి.రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

తెలంగాణాలో 42, ఆంధ్రాలో 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

నరసరావుపేట: తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం, ఆంధ్రాలో 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పెద్ద చెరువులోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం పత్రికా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కులగణన చేసి వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల సర్వే నివేదిక ద్వారా 57.6 శాతం బీసీలు ఉన్నట్లుగా నిర్ధారించి, అసెంబ్లీ ఉభయ సభల్లో ఆమోదింపజేసి జీవో నంబర్ 9 ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు నిర్ణయించిందన్నారు. అయితే కొన్ని రాజకీయ పార్టీలు హైకోర్టులో 23కిపైగా పిటిషన్లు వేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ను అడ్డుకునే ప్రయత్నం చేశాయన్నారు. దీన్ని ఏపీ బీసీ సంక్షేమ సంఘం పూర్తి స్థాయిలో ఖండిస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 55 శాతం పైగా ఉన్న బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లను ఏ రాజకీయ పార్టీ అడ్డుకున్నా వారు బీసీ ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఏపీలో 2026 జనవరిలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా కుల జన గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. మండల అధ్యక్షుడు నాగారపు గురు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, యువజన అధ్యక్షుడు సుతారం విశ్వేశ్వరరావు, కృష్ణ బలిజ సంఘం అధ్యక్షుడు మామిడాల గిరిబాబు పాల్గొన్నారు.

బాణసంచా తయారీని అనుమతించం

ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు



నరసరావుపేట టౌన్ : దీపావళి టపాసుల తయారీని అనుమతించేది లేదని నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్ణయించిన ప్రదేశాల్లో మాత్రమే దీపావళి బాణసంచా అమ్మకాలు జరపాలన్నారు. ఆర్డీవో ఆధ్వర్యంలో పండుగకు రెండు రోజుల ముందు ప్రదేశాన్ని నిర్ణయిస్తామన్నారు. వ్యాపారులకు ఇచ్చిన ప్రదేశంలోనే అనుమతి మేరకు దీపావళి టపాసులు విక్రయించాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా షాపుల వద్ద నీళ్లు, ఇసుక లాంటివి నిర్వాహకులే సమకూర్చుకోవాలన్నారు. అలాగే దీపావళి రోజు తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.